జర్నలిస్ట్ కాలనీ నూతన సంక్షేమసంఘం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులుగా ఎన్నికైన టీ.శ్రీనివాస్, కే.వెంకట్, ఓ.లింగస్వామి

దుండిగల్, డిసెంబర్ 21: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శనివారం చర్ల ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో జరిగింది. సమావేశంలో కాలనీ సభ్యులందరి ఆమోదం మేరకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్, రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సీనియర్ జర్నలిస్ట్ టీయూడబ్ల్యూజే(హెచ్-143)జిల్లా నాయకుడు కొలెపాక వెంకట్, కోశాధికారిగా సీనియర్ జర్నలిస్ట్, జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ఓర్సు లింగస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో సంక్షేమసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, టీయూడబ్ల్యూజే(హెచ్-143)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, సలహాదారులుగా సీనియర్ జర్నలిస్ట్‌లు గుంటూరు శేఖర్, దామర జగదీశ్వర్ గుప్తా, ఉద్దండపురం వెంకటేశ్‌గౌడ్, సిరిగిరి శ్రీనివాస్, నర్సింహతో పాటు టేకుల సుధాకర్‌రెడ్డి, జీతయ్య, పెంటయ్య ఎంపికయ్యారు. అదే విధంగా వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా సీనియర్ జర్నలిస్ట్‌లు ముక్కర్ల లాలయ్య, నాగేంద్రచారి, ఉపాధ్యక్షులుగా దేవేందర్ గుప్తా, శ్రీనివాస్, రామయాదవ్, మల్లి కార్జున్, జాయింట్ సెక్రటరీలుగా కృష్ణ, మారుతి కుమార్, కేవీవీ సత్యనారాయణ, పి.శ్రీనివాస్‌రావు, హబీబ్, కమిటీ సభ్యులుగా గోవింద్‌రావు, కే.లక్ష్మణ్, కే.రమేశ్, మహేశ్, లక్ష్మణ్, మణి, శ్వేతశ్రీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల సీజ్

కొండాపూర్, డిసెంబర్ 21: శేరిలింగంపల్లి సర్కిల్ -20 పరిధిలోని అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను గుర్తించిన అధికారులు ఏకంగా సీజ్ మంత్రం పాటిస్తున్నారు. శనివారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్‌నగర్‌లో పోలీసు బందోబస్తు నడుమ ఏకంగా 10 అక్రమ నిర్మాణాలను సీజ్ చేశారు. ఇప్పటికే గత శనివారం 6 భవనాలను సీజ్ చేసిన విషయం తెలిసిందే. అక్రమ నిర్మాణాలను ఒక్కొక్కటిగా గుర్తించి సమస్యలు తలెత్తకుండా నోటీసులు జారీ చేసి సీజ్ చేస్తున్నట్లు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ జీషన్, చైన్‌మన్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంబీపీ విద్యార్థినికి లయన్స్ క్లబ్ చేయూత

మాదాపూర్, డిసెంబర్ 21: చందానగర్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థినికి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ చేయూతగా నిలిచింది. ఎంబీఏలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తేజస్వినిని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రూ.20వేల ఆర్థిక సహాయాన్ని హుడా కాలనీలోని లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ కార్యాలయంలో చైర్మన్ కొండా విజయ్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బసిరెడ్డి మధుసుదన్‌రెడ్డి, ట్రజరర్ రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, నూకల సందీప్, మారం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్, డిసెంబర్ 21: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ క్రాంతి తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ కాలనీకి చెందిన నిఖిల్ గౌడ్(24) తాగుడుకు బానిస కావడంతో తల్లి మందలించింది. దీంతో శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ కెమెరాల ప్రాముఖ్యత గుర్తించాలి

బాలానగర్, డిసెంబర్ 21: సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని బాలానగర్ సీఐ నర్సింహరాజు సూచించారు. శనివారం బాలానగర్ డివిజన్ పరిధిలోని జామియా మసీద్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సెక్టార్ ఎస్సై సుభాష్, కానిస్టేబుల్ ఖదీర్, సుధాకర్‌రెడ్డి, ఎండీ బాషా, షర్ఫుద్దీన్, ఇలియాజ్, మసూద్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే.. క్యాన్సర్‌కు చికిత్స

బాలానగర్, డిసెంబర్ 21 : ప్రాథమిక దశలో గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందించవచ్చని గైనకాలజీ వైద్యురాలు డాక్టర్ రూపశ్రీ అన్నారు. శనివారం బాలానగర్ డివిజన్ పరిధి ఫిరోజ్‌గూడలోని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన రోట రీక్లబ్ ఆఫ్ గ్లోబల్ విజర్డ్స్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పలువురు మహిళలు పాల్గొని పలు వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ వైద్య శిబిరంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి వారు 150 మందికి డాక్టర్ సీ క్లినిక్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా భారత్ వికాస్ పరిషత్ ద్వారా మహిళలకు రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి రక్త హీనత ఉన్న వారికి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఎడ్ల శ్యామ్ కుమార్, ఎడ్ల సదానంద్, ఎడ్ల కృష్ణ, ఎడ్ల ప్రభాకర్, సభ్యురాలు రేణుక, సురేశ్, అనిల్, ఎంఎన్‌జే ఆస్పత్రి కో ఆర్డినేటర్ ప్రసాద్, జనహిత సేవా ట్రస్ట్ కో ఆర్డినేటర్ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లాపూర్, డిసెంబర్ 21: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ సామాజిక వేత్త లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు కెల్లా వెంకట్‌రావు సూచించారు. శనివారం వెంకట్‌రావు కుమారుడు హేమాని సాయి నాయుడు పుట్టినరోజు సందర్భంగా డివిజన్ పరిధిలోని గాయత్రినగర్ జన్‌స్ట్ స్కూల్‌లో బంజారాహిల్స్ లయన్స్‌క్లబ్ 320ఏ ఆధ్వర్యంలో పిక్సల్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షాకేంద్రాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో స్కూల్ విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులతో పాటు ఉచితంగా కంటిఅద్దాలు కూడా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బంజారాహిల్స్ లయన్స్ క్లబ్ 320ఏ అధ్యక్షుడు మధురాంతకం కైలాశ్, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ రాజు, కోశాధికారి జల్లా మధు, సీహెచ్ సత్యనారాయణ, జితేంద్ర, వైద్య సిబ్బంది బి.రాజశేఖర్, మహేంద్ర, కరణ్ జీత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

షాపూర్‌నగర్ ఉషోదయటవర్స్, సూరారం ప్రాంతాల్లో సర్వభోజనటీం శనివారం ఐదువేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సత్‌జ్ఞాన్ హైస్కూల్ కరస్పాండెంట్, ట్రస్మా ఉపాధ్యక్షుడు లయన్ చింతలమల్లేశం, నిర్వాహకులు జయచందర్, పృథ్వి, తేజ, మిత్ర బృందం పాల్గొన్నారు. **– కుత్బుల్లాపూర్, డిసెంబర్ 21**

కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, విద్యార్థులు

విద్యార్థులను గ్లోబల్ లీడర్లను చేయడమే లక్ష్యం

కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్, డిసెంబర్ 21: విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎంఎల్ఆర్ఐటీ కళాశాల యాజమాన్యం ముందుకు వెళ్తుందని కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని మర్రిలక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ)కళాశాలలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎన్ఐఎంఎస్ఎంఈ)సంస్థతో కలిసి ఎంబీఏ విద్యార్థులకు మార్కెటింగ్ రంగంపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు రకాల మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను (ఎండీపీ ఎస్)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రఖ్యాత ఎన్ఐ-ఎంఎస్ఎంఈ నిపుణుడు శరత్ ముత్యాల డిజిటల్ బ్రాండింగ్, సోషల్ మీడియాను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంపై విలువైన మెళకువలను వివరించారు. ఈ కార్యక్రమాలను చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.,కే.శ్రీనివాసరావు, ఎంబీఏ విభాగ అధిపతి డా. ఎంవీ.నరసింహారావు, కో-ఆర్డినేటర్ డా.వసుధ కురికాల, డా.బలరాం యలమశెట్టి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని కొనసాగిస్తామని తెలిపారు.

ముగిసిన మూడు రోజుల అంతర్జాతీయ స్థాయి సదస్సు

సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డా.అకిహికో సుగియమా, వీఎన్ఆర్‌వీజేఐఈటీ కళాశాల ప్రతినిధులు

దుండిగల్, డిసెంబర్ 21: నిజాంపేట్ ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(వీఎన్ఆర్‌వీజేఐఈటీ) కళాశాలలో మూడు రోజుల పాటు కళాశాలకు చెందిన ఎలక్ట్రానిక్స్, కంప్యూటింగ్ సంబంధిత ఏడు విభాగాలు సమష్టిగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. యూఎస్ఏ, జపాన్‌తో సహా భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సాంకేతికరంగ నిపుణులు, పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమలకు చెందిన నిష్ణాతులు పాల్గొని వివిధ కీలకోపన్యాసాలు చేశారు. ముగింపు కార్యక్రమంలో జపాన్‌లోని డమాస్కస్ సంస్థకు చెందిన డా.అకిహికో సుగియమా ప్రత్యక్షంగానూ, బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంచాలకులు డా.కేవీఎస్ హరి, అంతర్జాల వేదిక ద్వారా పాల్గొన్నారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్, సెమీకండక్టర్స్, సస్టెయినబిలిటీ, కమ్యూనికేషన్స్, కంప్యూటింగ్, హెల్త్‌కేర్ వంటి వివిధ సాంకేతికలకు సంబంధించిన అప్లికేషన్లు, సమస్యలు-పరిష్కారాలు, సమగ్రాలోచనా విధానం ఈ సదస్సులో చర్చకు వచ్చాయని నిర్వహకులు తెలిపారు. ఈ సదస్సులో కళాశాల ప్రతినిధి డా.వై.పద్మశాయి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్ ప్రధాన ద్వారం ఎదుట శ్రీనిధి కళాశాల యాజమాన్యం దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థి సంఘం నేతలు

విద్యార్థులను ఇబ్బంది పెట్టడం తగదు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 21: రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను ఇబ్బంది పెట్టడం తగదని జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థి సంఘం నేతలు అన్నారు. శనివారం జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కళాశాల యాజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్ రాలేదని, యాజమాన్యం విద్యార్థులను ఫీజులను చెల్లించాలని కోరడం.. విద్యార్థుల హాల్ టికెట్లను నిలిపివేయడం దారుణమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు చెల్లిస్తే... ప్రభుత్వం ఇచ్చాకా తిరిగి చెల్లిస్తామని చెప్పడం సరికాదన్నారు. ఒక్కో విద్యార్థిపై 1.40లక్షల భారం వేయడం బాధకరమన్నారు. విద్యార్థుల ఫీజులకు...పరీక్షలకు, ధ్రువపత్రాలకు ముడిపెట్టొందని పలు సర్క్యులర్స్ ఉన్నప్పటికి వాటిని ఆ కళాశాల యాజమాన్యం తుంగలో తొక్కి... విద్యార్థులను ఇబ్బందులను పెడుతున్నారు. శ్రీనిధి కళాశాలలపై వర్సిటీ అధికారులు, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వెంటనే ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు సిద్దార్థకుమార్, అనీష్, కిరణ్‌కుమార్, కళ్యాణ్, కాశీ, సాత్విక్, విశ్వనాథ్, దుర్గా, ధనుంజయ్, శ్రీనివాస్, సాగర్, హేమంత్, విశాల్, శ్రీకాంత్, చందు,ఆనంద్ తదితరులు ఉన్నారు.

శ్రీనివాస్‌రామానుజన్‌ను సేవలు స్ఫూరిదాయకం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 21: గణితం లేని మానవ సమాజం లేదని.. గణిత శాస్త్రాభివృద్ధికి అనాదిగా భారతీయులు అందిస్తున్న సేవలు గొప్పవని, విద్యార్థులు శ్రీనివాసరామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఏఎంవో రవీందర్‌రాజు అన్నారు. శనివారం కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీనివాసరామానుజన్ జయంతి(మ్యాథ్స్‌డే) సందర్భంగా శ్రీనివాస్‌రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన గణిత మేళాను ఏఎంవో రవీందర్‌రాజు, అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు రమేశ్, శైన్, స్వాతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ గణిత ప్రపంచానికి అందించిన సేవలను గొప్పవని.. ఆ మహనీయుడిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేపట్టాలని కోరారు. అతిచిన్న వయస్సులోనే గణితశాస్త్రంపై అపారమైన పట్టును సాధించిన భారతదేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటిన మహనీయుడు అని కొనియాడారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యయుడు నరేందర్‌రెడ్డి, శంకరప్పా, గోపాలకృష్ణ, కుసుమ, ధమయంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గణితంపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

దుండిగల్: విద్యార్థులు గణితంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. శనివారం నిజాంపేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు మ్యాథ్స్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన వివిధ పరికరాలను తయారు చేసి మేళాలో ప్రదర్శించారు. అంతకు ముందు విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. క్విజ్, రంగోలి, గణిత నమూనాల ప్రదర్శనలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో..

కొండాపూర్: మాదాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి ఆధ్వర్యంలో గణితశాస్త్ర దినోత్సవ కార్యక్రమానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గణితశాస్త్ర ఆచార్యులు పి.చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై గణితశాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.బసవలింగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం అభినందనీయం

కేపీహెచ్‌బీ కాలనీలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కృష్ణారావు, వైఎస్సార్ అభిమాన సంఘం నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 21: ఆంధ్ర పదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీలో వైఎస్సార్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే కృష్ణారావు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ మంత్రి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్సీలు వేంపల్లి సతీశ్‌రెడ్డి, చల్లా మధుసుదన్‌రెడ్డి, ఐటీ వింగ్ ప్రెసిడెంట్ సునీల్‌రెడ్డి, వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి, ఎస్‌వీఎస్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి శ్యామల పాల్గొని.. కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలిచారని, ఏపీ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ అభిమాన సంఘం నేతలు బండి మధుసూదన్‌రెడ్డి, బి.శివారెడ్డి, జీఎల్ఎన్ రెడ్డి, గాలిరెడ్డి, శేషసేనారెడ్డి, శేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, గౌతమ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హనిమిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాంరెడ్డి, టీఎల్ఆర్, అమర్నాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం..

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 21: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం క్యాంపు ఆఫీస్‌లో మూసాపేటకు చెందిన జి.సత్తయ్యకు రూ.1.50లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

మానవసేవయే.. మాధవసేవా: రాణాప్రతాప్

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 21: మానవసేవయే మాధవసేవయని, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు దేవుడు స్వయంగా రాడని, మనుషులతోనే సాటి మనుషులకు సాయం అందిస్తాడని స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సురగణ రాణాప్రతాప్ అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ కాలనీలోని సేవ్ ఏ లైఫ్ సేఫ్టీ ఫర్ హ్యూమానికి స్వచ్ఛంద సంస్థ 11వ వార్షికోత్సవం, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాణాప్రతాప్ తనయుడు సురగణ శరత్ జన్మదినం సందర్భంగా.. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో పుణ్యలింగేశ్వస్వామి దేవాలయంలోని అమ్మనాన్నా అనాథాశ్రమంలో 600 మంది పేదలకు అన్నదానం చేశారు. ఆశ్రమం నిర్వాహకుడు గట్టు శంకర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి జూపల్లి

దైవత్వం మానవత్వానికి వారధి ధ్యానం: గవర్నర్

శేరిలింగంపల్లి, డిసెంబర్ 21: ధ్యానం అనేది దైవత్వానికి, మానవత్వానికి మధ్య ఓ అద్భుతవారధని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ, శ్రీరామచంద్ర మిషన్‌ల సంయుక్త అధ్వర్యంలో శనివారం గచ్చిబౌలిలోని స్టేడియంలో నిర్వహించిన తొలి ప్రపంచ ధ్యాన దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేశ్ డి పటేల్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కేశవరావు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

భార్యను హతమార్చి పరార్.. నిందితుడు అరెస్ట్

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 21: కుటుంబ కలహాల నేపథ్యంలో కట్టుకున్న భార్యను కడతేర్చి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి వివరించారు. మహారాష్ట్ర, నాందేడ్‌లోని ఉమ్రి మండలం, గోలేగావ్‌కు చెందిన మాసేవాడ్ వెంకట్ అలియాస్ వ్యంకతి మరోటి మాసేవాడ్(30)తో నిజామాబాద్ జిల్లా, నవీపేట మండలం, ఫకీరాబాద్‌కు చెందిన రేపాని పావని అలియాస్ సోని వ్యంకతి మాసేవడ్(24)అనే మహిళకు పన్నేండ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మూడేండ్ల క్రితం కొంపల్లిలో నివాసముటూ కూలీ పనులు చేస్తున్నారు. కాగా ముగ్గురు పిల్లలు ఫకీరాబాద్‌లోని సోని తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. అయితే నిత్యం మద్యం సేవించే అలవాటున్న వెంకట్‌తో భార్య సోని గొడవపడేది. ఈ విషయంలో పులమార్లు కులపెద్దల సమక్షంలో పంచాయితీలు సైతం జరిగాయి. ఈనెల 20న మళ్లీ భార్యభర్తలు గొడవపడటంతో సెంట్రింగ్ కర్రతో సోని తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో అక్కడి నుంచి వెంకట్ పరారయ్యాడు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న వెంకట్‌ను శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో నిజామాబాద్‌లోని ఇందల్వాయి వద్ద బైక్‌పై వెళ్తుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. తానే తన భార్యను చంపినట్లు వెంకట్ అంగీకరించడంతో అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయవర్ధన్, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఎంట్రీ 40 శాతం కూడా చేయలేదు

మియాపూర్, డిసెంబర్ 21: ప్రజాపాలన పేరిట ఆరు గ్యారంటీలపై ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సరిగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయలేదని తద్వారా చాలా మంది పేదలు నష్టపోవాల్సి వస్తున్నదని వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అన్నారు. డివిజన్‌లో కనీసం 40 శాతం దరఖాస్తులను కూడా ఎంట్రీ చేయలేదన్నారు. వీకర్ సెక్షన్ కాలనీ వెంకటేశ్వర నగర్‌లో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల గుర్తింపును సీపీ పాపగౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి శనివారం పరిశీలించారు. ఆన్‌లైన్‌తో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను వర్తింప చేయాలని లేని పక్షంలో బాధితులందరితో సీఎం, డిప్యూటీ సీఎం ఇంటి ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు, జగదీశ్, రమేశ్, బాబు, రవీంద్రాపు, నాగార్జున, భారతీ